క్లుప్తంగా

నేడు నీటి సరఫరా బంద్

దేవరకొండ: కొండమల్లేపల్లి మండలం బాపూజీ నగర్ వద్ద గల వాటర్ ప్లాంట్ షట్‌డౌన్ కారణంగా శుక్రవారం దేవరకొండ పట్టణానికి నీటి సరఫరా నిలిచిపోనున్నట్లు మున్సిపల్ కమిషనర్ వై.సుదర్శన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నీటి సరఫరాలో జరిగే అంతరాయాన్ని ప్రజలు గమనించాలని సూచించారు. నీటిని పొదుపుగా వాడుకొని అధికారులకు సహకరించాలని ఆయన కోరారు.

మద్యం సేవించి వాహనాలు నడిపితే జైలు



డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు చేస్తున్న ఎస్ఐ రాంబాబు

మిర్యాలగూడ అర్బన్ : మద్యం సేవించి వాహనాలు నడిపితే జరిమానాతోపాటు జైలు శిక్ష తప్పదని టూ టౌన్ సీఐ సోమనర్సయ్య అన్నారు. గురువారం రాత్రి పట్టణంలోని ప్రధాన రోడ్డులో వాహనాదారులకు డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించి మాట్లాడారు. డీఎస్పీ కె.రాజశేఖర రాజు ఆదేశాల మేరకు గత కొద్దిరోజులుగా డంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. వాహనదారులు మద్యం సేవించినట్లు రుజువయితే కేసులు నమోదు చేసి వాహనాలను సీజ్ చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రాంబాబు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోపణలు అవాస్తవం

మిర్యాలగూడ: అవంతీపురం గ్రామంలో ఉన్న తన ఇంటి స్థలం గ్రామపంచాయతీ రికార్డులో నమోదైన విషయంలో నాగమణి చేస్తున్న ఆరోపణలు అవాస్తవమని ఉట్కూరి అరుణ అన్నారు. గురువారం విచారణ అధికారికి వాంగ్మూల పత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మా ఇంటి స్థలం వివాదం మూడు సంవత్సరాలుగా నడుస్తుందని, ఈ విషయం కోర్టులో కేసు నడుస్తుందని తెలిపారు. గ్రామపంచాయతీ రికార్డులో పేరు నమోదు చేసిన విషయంలో గ్రామపంచాయతీ కార్యదర్శి గాయత్రి ప్రమేయం ఉందని నాగమణి ఆరోపణలు చేయడం సరైందికాదన్నారు. ఈ విషయంలో కార్యదర్శి గాయత్రికి ఎలాంటి సంబంధం లేదన్నారు. కార్యదర్శి గాయత్రి గ్రామానికి రాకముందే రికార్డులో పేరు నమోదు అయిందని స్పష్టం చేశారు.

పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి



బస్టాండ్ వద్ద చెత్తా చెదారం తొలగిస్తున్న నాయకులు

దేవరకొండ: పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని స్వచ్ఛభారత్ జిల్లా కో–కన్వీనర్ నారాయణదాసు ఛండీశ్వర్ అన్నారు. భారత ప్రధాని నరేంద్రమోదీ జన్మదినాన్ని పురస్కరించుకొని గురువారం పట్టణంలో స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలోని పలుచోట్ల చెత్తా చెదారం తొలగించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పగిళ్ల రామ్, నేతాళ్ల వెంకటేష్, బెజవాడ శేఖర్, నక్క వెంకటేష్, గుండాల అంజయ్య, వస్కుల సుధాకర్, హరి, శంకర్, ఫణి తదితరులు పాల్గొన్నారు.

నేత్రదానంపై అవగాహన పెంచుకోవాలి

మిర్యాలగూడ అర్బన్ : నేత్ర దానంపై అవగాహన పెంచుకోవాలని ఆర్గాన్ డొనేషన్ చైర్మన్ మిట్టపల్లి విజయభాస్కర్‌రావు అన్నారు. గురువారం మిర్యాలగూడ పట్టణంలోని అశోకనగర్‌కు చెందిన గుంటూరు శ్రీనివాస్ మరణించడంతో ఆయన కుటుంబ సభ్యుల అనుమతితో డైమాండ్ నేత్రనిధి ద్వారా నేత్రాలను సేకరించి హైదరాబాద్ అగర్వాల్ కంటి ఆస్పత్రికి అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డైమాండ్ నేత్రనిధి సభ్యులు సామా శ్రీనివాస్, రాచకొండ శ్రీనివాస్, మట్టి మనిషి వెనేపల్లి పాండురంగారావు తదితరులు పాల్గొన్నారు.

రికార్డులు పరిశీలించిన సబ్ కలెక్టర్

అడవిదేవులపల్లి : అడవిదేవులపల్లి మండల తహసీల్దారు కార్యాలయాన్ని గురువారం మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్ సందర్శించి రికార్డులను పరిశీలించారు. భూభారతిలో అవతకవకలకు పాల్పడకుండా సమర్థవంతంగా విధులు నిర్వహించాలన్నారు. ఆయన వెంట తహసిల్దారు రాగ్యానాయక్, నాయబ్ తహసిల్దారు శ్రీనివాస్ ఉన్నారు.



అధికారులు, సిబ్బందితో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్

పచ్చని చెట్లు.. బొగ్గు పాలు



బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో చెట్లను నరికివేసి తరలిస్తున్న కూలీలు



ముప్పారం గ్రామ శివారులో కొట్టివేసిన మర్రిచెట్టు

నిడమనూరు : నిడమనూరు మండలంలో పర్యావరణానికి ముప్పు పొంచి ఉంది. ఇక్కడ ప్రభుత్వ కార్యాలయం ప్రాంగణంలోని చెట్లను కూడా భారీగా నరికివేసి, వాటిని అక్రమంగా బొగ్గుల బట్టీలకు తరలిస్తున్నారు. స్థానిక నిడమనూరులోని బీఎస్ఎన్ఎల్ టెలికాం కార్యాలయం చాలా కాలంగా మూతపడింది. ఈ కార్యాలయం ప్రాంగణంలోని పదుల సంఖ్యలో చెట్లను నరికివేసి, సమీపంలోని ముప్పారం గ్రామంలో ఉన్న బొగ్గుల బట్టీలకు తరలించారు. అదే విధంగా గతంలో నల్లగొండ ప్రజలకు తాగునీరు అందించిన ముప్పారం మంచినీటి పథకం కూడా మూతపడింది. అక్కడ కూడా రెండు రోజుల క్రితం ఒక భారీ మర్రి చెట్టును నరికివేశారు. కొందరు అక్రమార్కులు ముఠాగా ఏర్పడి ఇలా ఎవరూ లేని ప్రదేశాలను గుర్తించి చెట్లను నరికివేసి, వాటిని బొగ్గుల బట్టీలకు, మిర్యాలగూడలోని పవర్ ప్లాంట్లకు విక్రయిస్తున్నారు. ఇది వారికి పెద్ద ఉపాధి మార్గంగా మారింది. అయితే అటవీ అధికారులు మాత్రం ఈ అక్రమాలను చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ అక్రమాలకు అటవీ అధికారులకు తెలిసే జరుగుతున్నాయనే ఆరోపణలు వస్తున్నాయి. ఈ వ్యాపారంలో అధికారుల భాగస్వామ్యం కూడా ఉందని కూలీలు చెబుతున్నారు. ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి ఈ అక్రమ బొగ్గుల బట్టీలపై, వాటి వెనుక ఉన్న అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.



ముప్పారం గ్రామ శివారులోని బొగ్గుల బట్టి

పర్యావరణ పరిరక్షణకు కృషిచేయాలి

● ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



వెదురుతో తయారు చేసిన వస్తువులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

మిర్యాలగూడ : పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని గాంధీనగర్‌లో మిర్యాలగూడ మేదరి సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రపంచ వెదురు దినోత్సవంలో ఆయన ఎమ్మెల్సీ కేతావత్ శంకర్‌నాయక్‌తో కలిసి పాల్గొని వెదురు వస్తువుల ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ .. మేదరి కుల వృత్తి అనేది ఒక సామాజిక బాధ్యత వంటిదని అన్నారు. మేదరి కులస్తులు వెదురు వస్తువులను తయారు చేస్తూ పర్యావరణ పరిరక్షణకు తమవంతుగా తోడ్పడుతున్నారని అన్నారు. మనమందరం కూడా ప్లాస్టిక్ వస్తువులకు దూరంగా ఉండి ప్రత్యామ్నాయంగా వెదురు వస్తువులను ఉపయోగించి మేదరి సోదరులకు ఉపాధి కల్పించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పింఛన్లు పెంచే వరకూ పోరాటం

● ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవింద్ నరేష్ మాదిగ



మాట్లాడుతున్న గోవిందు నరేష్ మాదిగ

హాలియా : కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఆసరా పెన్షన్లు పెంచే వరకూ పోరాటం చేస్తామని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు నరేష్ మాదిగ అన్నారు. గురువారం హాలియా పట్టణంలోని ఆర్అండ్‌బీ గెస్ట్ హౌజ్‌లో జరిగిన ఎమ్మార్పీఎస్ నియోజకవర్గస్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వికలాంగుల పెన్షన్ రూ. 6వేలు, వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, అన్ని రకాల చేయూత పెన్షన్లు రూ.4వేలకు పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఈనెల 23న హాలియాలో చేయూత పెన్షన్‌దారుల మహాసభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ మహాసభలో పెన్షన్‌దారుల ఆశాజ్యోతి, పద్మశ్రీ అవార్డు గ్రహిత మంద కృష్ణ మాదిగ ముఖ్య అతిథిగా పాల్గొంటారని తెలిపారు. పెన్షన్‌దారులు, ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఎమ్మార్పీఎస్ హాలియా ఇన్‌చార్జ్ పోలేని యాదయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంఎస్పీ, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర సమన్వయ కర్త జానకిరామయ్య చౌదరి, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఇరిగి శ్రీశైలం మాదిగ, జిల్లా కార్యదర్శి తరి ఏడుకొండలు మాదిగ, వీహెచ్‌పీఎస్ మహిళా అధ్యక్షురాలు చైతన్య రెడ్డి, ఎంఎస్పీ జిల్లా అధికార ప్రతినిధి మడుపు శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి ఏర్పుల వెంకటయ్య మాదిగ, నాయకులు గార్లపాటి ప్రసాద్, గడుసు సైదీష్, కుక్కమూడు ముత్యాలు, రాజీవ్, శ్రీను, బాలకృష్ణ, రాజు, పాపమ్మ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి



మాట్లాడుతున్న కోరే రమేష్

హాలియా : పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను పూర్తిస్థాయిలో తక్షణమే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు కోరే రమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ అనుముల మండల కమిటీ ఆధ్వర్యంలో గురువారం హాలియా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన నూతన కమిటీ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. తెలంగాణలో ఉన్న అన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఖాళీగా ఉన్న లెక్చరర్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, కళాశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే మధ్యాహ్న భోజనం అమలు చేయాలని, విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అనుముల మండల కార్యదర్శి బుడియపాక వర్షిత్, నాగరాజు, చరణ్, రాజీవ్, వైశాలి, అనిత, అంజలి, సుధాకర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు



అడవిదేవులపల్లిలోని వైకుంఠధామాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ రాగ్యానాయక్

అడవిదేవులపల్లి : ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే వారిపై కఠిన చర్యలు ఉంటాయని తహసీల్దార్ రాగ్యానాయక్ హెచ్చరించారు. గురువారం స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంలోని వైకుంఠ ధామం సమీపంలో 435 సర్వే నంబర్‌లో సుమారు 30ఎకరాల బీడు భూములను అక్రమంగా జేసీబీతో చదువును చేసిన భూమిని సర్వేయర్ రెవెన్యూ సిబ్బందితో కలిసి పరిశీలించినట్లు తెలిపారు. మండల కేంద్రానికి సమీపంలో 30 ఎకరాల ప్రభుత్వ భూముల్లో నాయీ బ్రహ్మణ కులస్థులు కొంత మంది మంగలినాముగా నామకరణం చేసుకొని, ఈ భూములను ఆక్రమిస్తే చర్యలు తప్పవన్నారు. ఈ భూముల్లో జేసీబీలు, ఇతర యంత్రాలు వస్తే వాటిని సీజ్ చేస్తామని హెచ్చరించారు. 435 సర్వే నంబర్‌లో ఈ భూమికి భూ భారతిలో ఎట్టి పరిస్థితుల్లో పట్టాలను ఇవ్వమన్నారు. ఈ భూమిని ప్రభుత్వ అవసరాలకు మాత్రమే వినియోగించనున్నట్లు తెలిపారు. ఆయన వెంట రెవెన్యూ సిబ్బంది తదితరులున్నారు.

పాఠశాలలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

● జెడ్పీ సీఈఓ శ్రీనివాస్‌రావు

వేములపల్లి: ప్రభుత్వ పాఠశాలలను పరిశుభ్రంగా ఉంచాలని జెడ్పీ సీఈఓ, మండల ప్రత్యేకాధికారి శ్రీనివాస్‌రావు అధికారులకు, ఉపాధ్యాయులకు సూచించారు. గురువారం వేములపల్లి, శెట్టిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను ఆయన తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. అనంతరం స్వచ్ఛ సేవా కార్యక్రమంలో భాగంగా పాఠశాల ఆవరణలో చెత్తను సిబ్బందిచేత తొలగింపచేశారు. అదే విధంగా గ్రామాల్లో ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా వీధులను, డ్రైనేజీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో దండ జితేందర్‌రెడ్డి, ఎంఈవో లక్ష్మణ్‌నాయక్, ప్రధానోపాధ్యాయుడు బూరుగు రమేష్, పంచాయతీ కార్యదర్శులు నవీన్, శ్రవణ్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.



పాఠశాల ఆవరణలో చెత్తను తొలగిస్తున్న జెడ్పీ సీఈఓ శ్రీనివాస్‌రావు

ఎమ్మెల్యే చిత్రపటానికి పాలాభిషేకం



మిర్యాలగూడ : ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



వేములపల్లిలో..

వేములపల్లి : రైతుల సంక్షేమం కోసం కృషిచేస్తున్న ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి చిత్రపటానికి గురువారం మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద కాంగ్రెస్ నాయకులు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మాలి కాంతారెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ పుట్టల కృపయ్య మాట్లాడుతూ.. ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి తన కుమారుడు, కోడలు రిసెప్షన్‌ను రద్దు చేసి ఆ నగదును నియోజకవర్గంలోని ప్రతి రైతుకు ఒక బస్తా యూరియాను ఉచితంగా అందించాలని కోరుతూ గురువారం సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి రూ.2కోట్ల చెక్కు అందించడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో నాయకులు బుసిరెడ్డి వెంకట్‌రెడ్డి, చల్లబొట్ల శ్రీనివాస్‌రెడ్డి, పుట్టల శ్రీను, పేరెల్లి నగేష్, నాగవెల్లి మధు, రేబెల్లి రామచంద్రు, వల్లంపట్ల ప్రవీణ్, మజ్జిగపు సుధాకర్‌రెడ్డి, అశోక్, చంటి, గిరి, ఎల్లయ్య, శ్రీనివాస్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమం కోసం ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి కృషి

మిర్యాలగూడ : రైతుల సంక్షేమం కోసం కృషిచేస్తున్న ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి చిత్రపటానికి గురువారం పట్టణంలోని రాజీవ్‌చౌక్ వద్ద కాంగ్రెస్ నాయకులు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండలఅధ్యక్షుడు కాకునూరి బసవయ్యగౌడ్, గుండు నరేందర్, సారెడ్డి శంకర్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి నిత్యం ప్రజా, రైతుల సంక్షేమం కోసం పాటుపడుతున్నారని అన్నారు. తన కుమారుడు రిసెప్షన్ కోసం ఖర్చు చేసే రూ.2 కోట్లను నియోజకవర్గంలోని రైతుల కోసం ప్రభుత్వానికి విరాళంగా అందించి ప్రతి రైతుకు ఒక యూరియా బస్తాను ఉచితంగా ఇవ్వాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు షేక్ జిందా, పోలగాని వెంకటేష్‌గౌడ్, లింగయ్య, అర్జున్‌యాదవ్, బొంగరాల కిరణ్, దండ ప్రభాకర్‌రెడ్డి, శ్రీహరినాయక్, కొండ జోష్‌గౌడ్, నాగరాజు, సుధాకర్, షాబుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

● ఎమ్మెల్యే బాలునాయక్



విద్యార్థులతో కబడ్డీ ఆడుతున్న ఎమ్మెల్యే

దేవరకొండ: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ సూచించారు. గురువారం దేవరకొండ పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్–14,అండర్–17 నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. గ్రామీణ ప్రాంత క్రీడాకారులు జాతీయస్థాయిలో రాణించాలన్నారు. విద్యార్థులు క్రీడల పట్ల ఆసక్తి పెంపొందించుకోవాలని సూచించారు. నియోజకవర్గ పరిధిలోని మండలాల్లో మినీ స్టేడియాలు నిర్మించాలని యోచిస్తున్నట్లు తెలి పారు. క్రీడల అభివృద్ధికి ప్రజా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి క్రీడల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ డానియల్, సీఐ వెంకట్‌రెడ్డి, మారుపాకుల సురేష్‌గౌడ్, యూనూస్, గోవిందు, వైఎస్ కరుణాకర్ పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం

పెద్దఅడిశర్లపల్లి : లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయమని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. గురువారం పెద్దఅడిశర్లపల్లిలో నూతనంగా ఎన్నికైన లయన్స్ క్లబ్ మండల కమిటీ ప్రతినిధుల సన్మానోత్సవానికి ఆయన హాజరై మాట్లాడారు. గ్రామీణ స్థాయిలో పేద ,బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి లయన్స్ క్లబ్ సేవలు మరింత విస్తరించాలన్నారు. లయన్స్ క్లబ్ మండల అధ్యక్షుడిగా ముచ్చర్ల ఏడుకొండల్ యాదవ్, ఉపాధ్యక్షులుగా రేటినేని ముత్యంరావు, నెర్మటి సతీష్‌రెడ్డి, కార్యదర్శిగా మార్కొండయ్య, సహాయ కార్యదర్శిగా విడియాల భిక్షమయ్య, ట్రెజరర్‌గా ఎల్గూరి వెంకట్‌రెడ్డి ఎన్నిక కాగా వీరిని ఎమ్మెల్యే సన్మానించారు.

అంకితభావంతో పని చేసినప్పుడే గుర్తింపు

దేవరకొండ: ఉపాధ్యాయులు అంకితభావంతో పని చేసినప్పుడే తగిన గుర్తింపు లభిస్తుందని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. గురువారం దేవరకొండ పట్టణంలో నిర్వహించిన నియోజకవర్గ పరిధిలోని మండలాల ఉత్తమ ఉపాధ్యాయుల సన్మానోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఉపాధ్యాయ వృత్తి కేవలం ఉద్యోగం మాత్రమే కాదని విద్యార్థుల భవిష్యత్‌కు బంగారు బాటలు వేసేదని పేర్కొన్నారు. విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దే గురుతర బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని అన్నారు. ప్రభుత్వం విద్యారంగానికి అధిక ప్రాధాన్యమిస్తూ నిధులు కేటాయిస్తున్నట్లు గుర్తు చేశారు. అనంతరం ఉత్తమ ఉపాధ్యాయులకు జ్ఞాపికలు అందజేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి, ఎంపీడీఓ డానియల్, ఎంఈఓలు మాతృనాయక్, నాగేశ్వరరావు, గోప్యానాయక్, నాయకులు యూనూస్, బిక్కునా యక్, రాంసింగ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



దేవరకొండ: ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్

బాధిత కుటుంబాలకు పరామర్శ

హాలియా : హాలియా మున్సిపాలిటీ పరిధిలోని అనుములకు చెందిన కుందూరు భరత్‌రెడ్డి అనారోగ్యంతో బుధవారం రాత్రి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కుందూరు జయవీర్‌రెడ్డి ఎమ్మెల్సీ శంకర్ నాయక్‌తో కలిసి గురువారం అనుములలోని బాధిత నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా కుందూరు భరత్‌రెడ్డి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అదే విధంగా అనుముల గ్రామంలో మృతి చెందిన నడ్డి దయాకర్, బొమ్ము పుల్లమ్మ కుటుంబ సభ్యులను పరామర్శించి మృతుల చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. పరామర్శించిన వారిలో కాంగ్రెస్ పార్టీ అనుముల మండల అధ్యక్షుడు కుందూరు వెంకట్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు చింతల చంద్రారెడ్డి, గౌనీ రాజా రమేష్ యాదవ్, చంద్రశేఖర్, పిల్లి ఆంజనేయులు, కుందూరు శ్యామ్‌సుందర్ రెడ్డి, ప్రసాద్ నాయక్, సైదులు, వెంకటేశ్వర్లు, ఈదయ్య తదితరులు ఉన్నారు.



కుందూరు భరత్‌రెడ్డి మృతదేహానికి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే కుందూరు జయవీర్‌రెడ్డి

సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేదలకు వరం



త్రిపురారంలో సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులు పంపిణీ కాంగ్రెస్ నాయకులు

త్రిపురారం : సీఎం రిలీఫ్‌ఫండ్ పథకం నిరుపేద కుటుంబాలకు వరం లాంటిదని త్రిపురారం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ముడిమళ్ల బుచ్చిరెడ్డి అన్నారు. మండలంలోని కంపాలపల్లి గ్రామానికి చెందిన జొన్నలగడ్డ కృష్ణారెడ్డికి సీఎంఆర్ఎఫ్ పథకంలో భాగంగా మంజూరైన రూ.లక్షా 10వేల చెక్కును గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బుచ్చిరెడ్డి మాట్లాడుతూ.. అనారోగ్య సమస్యలతో బాధపడుతూ వైద్యం చేయించుకోలేని స్థితిలో ఉన్న వారిని ప్రభుత్వం సీఎం రిలీఫ్‌ఫండ్ పథకంతో ఆదుకుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గౌరవ సలహాదారు అనుముల శ్రీనివాస్ రెడ్డి, త్రిపురారం మండల యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి సలికంటి బాలకృష్ణ, సోషల్ మీడియా కన్వీనర్ జయకృష్ణ పాల్గొన్నారు.

ముగిసిన ‘పోషణ్ భీ- పడాయి భీ’పై శిక్షణ

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడ ప్రాజెక్టు పరిధిలో అక్టోబర్ 16వ తేదీ వరకు పోషణ మాసం కార్యక్రమాలను షెడ్యూల్ ప్రకారం నిర్వహించాలని మిర్యాలగూడ అర్బన్ సీడీపీఓ రేఖల మమత అన్నారు. గురువారం మిర్యాలగూడలోని ఎంపీడీఓ కార్యాలయంలో గల సమావేశ మందిరంలో అంగన్‌వాడీ టీచర్లకు ‘పోషణ్ భీ– పడాయి భీ’ పై జరిగిన మూడు రోజుల శిక్షణ ముగింపు కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. దివ్యాంగులైన పిల్లలను కూడా గుర్తించాలని, గృహ సందర్శన చేపట్టాలని, పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. ముందుగా పోషణ మాసంపై ప్రతిజ్ఞ చేయించాలన్నారు. అదేవిధంగా స్థానిక రైతు వేదికలో నిర్వహించిన అంగన్‌వాడీ టీచర్ల శిక్షణ ముగింపు కార్యక్రమంలో దామరచర్ల ప్రాజెక్టు సీడీపీఓ చంద్రకళ పలు అంశాలను వివరించారు. అర్బన్ ప్రాజెక్టు సూపర్‌వైజర్లు నాగమణి, నజీమాబేగం, రాధిక, వాణి, లీలాకుమారి, పద్మ, బ్లాక్ కోఆర్డినేటర్ కవిత, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న సీడీపీఓ రేఖల మమత

2వ తేదీ వరకు లోక్ కళ్యాణ్ మేళా

మిర్యాలగూడ టౌన్ : పీఎం స్వానిధి పథకంలో భాగంగా లోక్ కళ్యాణ్ మేళా కార్యక్రమాన్ని అక్టోబర్ 2వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు మిర్యాలగూడ మున్సిపల్ కమిషనర్ జి. శ్రీనివాస్ తెలిపారు. గురువారం తన ఛాంబర్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ వీధి వ్యాపారులకు మొదటి విడతలో రూ.15వేలు, సమయానికి చెల్లిస్తే రూ.20వేల వరకు, ఇంకా మంచిగా కడితే మూడో విడతలో రూ.50వేల రుణం ఇవ్వనున్నట్లు తెలిపారు ఈ సమావేశంలో మెప్మా టీఎంసీ పొతేపాక బక్కయ్య, సీఓలు మామిడాల శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, వివిధ బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి



కబడ్డీ ఆడుతున్న విద్యార్థులు

తిరుమలగిరి(నాగార్జునసాగర్) : విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం నాగార్జునసాగర్ నియోజకవర్గ స్థాయి ఎస్‌జీఎఫ్ అండర్–14, అండర్–17 బాల, బాలికల సెలక్షన్ కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా కర్నాటి లింగారెడ్డి మాట్లాడుతూ క్రీడలతో విద్యార్థులు నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవచ్చని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడారంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తోందని అన్నారు. జాతీయ స్థాయిలో క్రీడాకారులను తయారు చేయడమే ప్రభుత్వం ముందున్న లక్ష్యమని చెప్పారు. ఈ పోటీల్లో సుమారు ఐదు వందల మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను జిల్లా స్థాయి పోటీలకు ఎంపికచేస్తారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ కొనమంచిలి శ్రీనివాస్, హాలియా ఏఎంసీ చైర్మన్ తుమ్మలపల్లి శేఖర్‌రెడ్డి, దగ్గుపాటి విమల, నాయకులు పెద్దిరెడ్డి, నాగిరెడ్డి, పాండు నాయక్ పాల్గొన్నారు.